సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 5 । మే । 2025



నిర్మాణాలన్నీ పక్క ప్లాన్లే!

చందనోత్సవం సందర్భంగా ఇటీవల సింహాచలం క్షేత్రంలో చోటుచేసుకున్న దుర్ఘటన ప్రభావం రత్నగిరి ప్రసాద్ నిర్మాణాలపై పడనుంది.


8 లో



కూర్మానికి కష్టకాలం!

సుమారు 350 ఏళ్లకు పైబడి ఆయుః ప్రమాణం ఉండే ఆలివ్ రిడ్లే తాబేళ్లు నియంత్రణ లేని చేపల వేటతో చనిపోతున్నాయి.

కడలిలోకి 1,969 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 1,969 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రం లోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.85 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయ లేదు.

న్యూస్‌రీల్

దంచికొట్టిన వాన



కొవ్వూరులో భారీ వర్షానికి రోడ్డుపై కూలిన చెట్టు

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా ఆదివారం వర్షం దంచి కొట్టింది. తాళ్లపూడి మండలం పైడిమెట్టలో గరిష్ఠంగా 65 మిల్లీమీటర్లు నమోదైంది. ఉదయం 8.30 నుంచి రాత్రి 7 గంటల వరకూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. తాళ్లపూడి 57.5, కొవ్వూరు 57.25, గోపాలపురం 32, సగ్గొండ 24, నల్లజర్ల మండలం పోతవరం 19.75, ఉండ్రాజవరం 15.5, నిడదవోలు 13.5, బిక్కవోలు 23.75, సీతానగరం మండలం నాగంపాలెం 19.5, మిర్తిపాడు 41.25, ముగ్గళ్ల 34.5, రంగంపేట 19.25, అనపర్తి 16, రాజమహేంద్రవరం 49, కోరుకొండ 36.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ప్రశాంతంగా నీట్

2,690 మంది హాజరు



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో పరీక్షకు వచ్చిన విద్యార్థినులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య విద్యా కోర్సులలో ప్రవేశానికి దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్ జిల్లాలోని 8 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. మొత్తం 2,760 మంది దరఖాస్తు చేసుకోగా, 2,690 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులను గంట ముందుగా ఆయా పరీక్ష కేంద్రాల లోపలకు అనుమతించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పర్యవేక్షణలో స్థానిక కంబాల చెరువు ఎస్‌బీఐ బ్రాంచిలో భద్రపరిచిన ప్రశ్న పత్రాలను కట్టుదిట్టమైన భద్రత మధ్య పరీక్ష కేంద్రాలకు తరలించారు. పలు కేంద్రాలను కలెక్టర్ పి.ప్రశాంతి తనిఖీ చేశారు. పరీక్షల విధులకు హాజరైన అధికారులు, ఇన్విజిలేటర్లు, ఇతర సమన్వయ అధికారులకు పలు సూచనలు చేశారు. రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో 355 మంది, రాజానగరం మండలం నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 463 మంది, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 230 మంది, రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 233 మంది, దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో 231 మంది, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 474 మంది, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 470 మంది, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 234 మంది ఈ పరీక్ష రాశారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టంలో నిర్దేశించిన విధంగా ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ఈ విషయం పేదలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని, పత్రికల్లో వచ్చిన వార్తలను వాట్సాప్, స్కూలు, ఇతర గ్రూపుల్లో దపదఫాలుగా షేర్ చేయాలని ఎంఈఓలకు సూచించారు. అన్ని సచివాలయాలు, ఎంఈఓ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి, ఫొటోలు షేర్ చేయాలన్నారు. సోమవారం నుంచి వీలైనంత ఎక్కువ మందితో తమ మండలాల్లో రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,34,020 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చివరిలో వణుకు

- పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం
- నిలిచిపోయిన రబీ మాసూళ్లు
- జిల్లా వ్యాప్తంగా 58,586 హెక్టార్లలో వరి సాగు
- ఇంత వరకూ 86.6 శాతం కోతలు
- కోతలు జోరుగా సాగుతున్న సమయంలో భారీ వర్షం
- పనల మీదనే వరి చేలు.. రహదారులపై ధాన్యం
- ఆందోళనలో రైతులు



పెరవలి మండలం అన్నవరప్పాడులో ధాన్యంపై బరకాలు కప్పుతున్న రైతు

సాక్షి, రాజమహేంద్రవరం: రబీ వరి కోతలు చివరి దశకు చేరుకున్నాయి. ధాన్యం రోడ్లు, కళ్లాల్లో ఉంది. ఇటువంటి తరుణంలో కురుస్తున్న వర్షాలు వరి రైతులకు వణుకు పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా ఆదివారం పలు ప్రాంతాల్లో రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో, చేతికందిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు నానా పాట్లూ పడుతున్నారు. ధాన్యం రైతులకు ఇప్పటికే ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. టార్గెట్లు పూర్తయ్యాయనే సాకుతో ధాన్యం సేకరణ ఆపేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే తప్ప తీసుకునేది లేదని అధికారులు, మిల్లర్లు చెబుతున్నారు. చేసేది లేక రైతులు ధాన్యాన్ని కళ్లాలు, రోడ్ల పక్కన బరకాలు కప్పి నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. ప్రభుత్వం నుంచి అనుమతులు ఎప్పుడు వస్తాయా అని వారు నిరీక్షిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు జల్లాయి. పలు ప్రాంతాల్లో మాసూళ్లు చేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్నామని, ధాన్యం తడిసిపోతే పరిస్థితి మరింత దిగజారుతుందని వాపోతున్నారు.

ఎక్కడి ధాన్యం అక్కడే..

జిల్లావ్యాప్తంగా 58,586 హెక్టార్లలో రబీ వరి సాగు జరిగింది. 5.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 2.50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. 216 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటి వరకూ 2,63,076 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసి, లక్ష్యాలను అధిగమించామని చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ముగియడంతో ధాన్యం కొనుగోళ్లు ఆపేశారు. తిరిగి ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తేనే సేకరిస్తామని చెబుతున్నారు. దీంతో ఎక్కడి ధాన్యాన్ని అక్కడే పెట్టుకుని రైతులు ఎదురు చూడాల్సిన దుస్థితి తలెత్తింది. నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, రాజానగరం, కడియం, కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల పరిధిలో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే దర్శనమిస్తున్నాయి. ఈ తరుణంలో ఆదివారం వర్షం కురవడంతో ధాన్యం రాశులపై బరకాలు కప్పుతూ, ఎండ వస్తే ఆరబెట్టుకుంటూ నానా పాట్లూ పడుతున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయనే సూచనలతో మరింత ఆందోళన చెందుతున్నారు.

రోడ్లపై 60 వేల టన్నుల ధాన్యం

జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 86.6 శాతం పూర్తయ్యాయి. తద్వారా 4,60,879 మెట్రిక్ టన్నుల ధాన్యం అందుబాటులోకి వచ్చింది. వీటిలో 2.60 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మిగిలిన రెండు లక్షల టన్నుల్లో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించగా.. ప్రస్తుతం సుమారు 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వివిధ ప్రాంతాల్లో రోడ్లు, పొలాలు, కళ్లాల్లో ఉందని సమాచారం. వర్ష సూచనల నేపథ్యంలో ప్రస్తుతం కోతలు, కొనుగోళ్లు ఆపేశారు. మరో 13 శాతం విస్తీర్ణంలో కోతలపై ఆందోళన నెలకొంది. వర్షం ఇలాగే కొనసాగితే పొలాల్లో నీరు చేసి పంట దెబ్బ తినే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

కంట్రోల్ రూముల ఏర్పాటు

రాజమహేంద్రవరం రూరల్: భారీ వర్షాల దృష్ట్యా పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఆదివారం నుంచి 72 గంటల పాటు కలెక్టరేట్, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సిబ్బందికి డ్యూటీలు వేశామని కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. అధిక వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో జిల్లాలో ఏవైనా ప్రతికూల పరిస్థితులు తలెత్తితే రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ed&apsdma@ap.gov.in లేదా seoc&apsdma@ap.gov.in లేదా 1070, 1800-425-0101, 83339 05022 టోల్ ఫ్రీ నంబర్లకు తెలియజేయాలని అన్నారు.

కంట్రోల్ రూము నంబర్లు

కలెక్టరేట్	89779 35611
రాజమహేంద్రవరం ఆర్డీఓ	0883-2442344
కొవ్వూరు ఆర్డీఓ	85006 67698

లోతట్టు ప్రాంతాలు జలమయం

రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటించింది. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా ఆదివారం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రాజమహేంద్రవరం నగరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వర్షం దంచికొట్టింది. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో సగటున 1.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాళ్లపూడి మండలం పైడిమెట్టలో అత్యధికంగా 65 మిల్లీమీటర్లు మేర నమోదైంది.



అన్నవరప్పాడులో తడిసిన ధాన్యం చూపుతున్న రైతు

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అకాల వర్షాలు, వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో కోతలు పూర్తి చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రబీ ధాన్యం కొనుగోలుపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో ఆదివారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 216 రైతు సేవా కేంద్రాల ద్వారా రబీలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకూ 2,63,076 మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. జిల్లావ్యాప్తంగా కోతలు పూర్తయిన వరి చేలకు సంబంధించి 16,613 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఈ ధాన్యాన్ని మిల్లులకు తరలించడంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈదురు గాలులు, భారీ వర్షాల నేపథ్యంలో ప్రమాదకర హోర్డింగులు, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్ల విషయంలో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సరైన నిర్వహణ, పటిష్టంగా లేని వాటిని తొలగించే క్రమంలో సంయమనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. గోదావరిలో నిర్దేశిత స్నాన ఘట్టాల్లో మాత్రమే స్నానాలకు అనుమతించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో హెచ్చరికలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి నదీ తీరంలోని వీఆర్‌ఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇటీవల గోదావరి నదిలో మునిగి మరణాలు సంభవించడం దురదృష్టకరమని, అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఇచ్చిన సమాచారం ప్రకారం నియోజకవర్గాల వారీగా ధాన్యం దిగుబడి, సేకరణ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

నియోజకవర్గం	దిగుబడి	కొనుగోలు
అనపర్తి	25,800	17,903
గోపాలపురం	32,105	30,038
గోకవరం (మండలం)	8,758	8,637
కొవ్వూరు	70,479	67,928
నిడదవోలు	89,099	86,054
రాజమహేంద్రవరం రూరల్	14,782	14,605
రాజానగరం	38,641	37,911

ప్రభుత్వ బాధ్యతారాహిత్యంతో రైతులకు కష్టాలు



మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వ బాధ్యతారాహిత్యం వల్లనే రైతులు ఇప్పుడు కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతుల వద్ద ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో ఇప్పుడు వర్షాలు కురిసి, రైతులు నష్టపోయే దుస్థితి ఏర్పడిందని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలంటూ ఇప్పటికే తమ పార్టీ డిమాండ్ చేసిందని, తద్వారా మొద్దు నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని మేల్కొలిపే ప్రయత్నం చేసిందని చెప్పారు. కానీ, ప్రభుత్వ పెద్దలు ఎదురుదాడి చేస్తున్నారే తప్ప రైతులను ఆదుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం రైతు పక్షాన పని చేయాలని, కానీ, కూటమి సర్కారుకు ఆ ధ్యాసే లేదని అన్నారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనడం కష్టమని వ్యవసాయ మంత్రి స్వయంగా చెబుతున్న దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని దుయ్యబట్టారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ధాన్యం రోడ్లపై రాశులుగా ఉందని, గిట్టుబాటు ధర రావడం లేదని అన్నారు. రూ.1,725కు కొనాల్సిన ధాన్యాన్ని రూ.1,500కు కొంటున్నారని, ధాన్యం తడిసిపోతే ధర రూ.1,300కు తగ్గించేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి ఉంటే ఈపాటికి ధాన్యం అంతా మిల్లులకు చేరేదన్నారు. తడిసిన ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారని, రోడ్లపై ధాన్యాన్ని ఉంచి దగా పడి రోదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్వయంగా వెళ్లి రోడ్లపై ఉన్న మొత్తం ధాన్యాన్ని రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వేణు డిమాండ్ చేశారు.



తడిసిపోయిన ధాన్యం బస్తాలు



దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద వర్షానికి తడిసిన ధాన్యం

అయినవిల్లికి భక్తుల తాకిడి



స్వామివారి సన్నిధిలో లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘు న్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ నిర్వహించారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 44 మంది, లక్ష్మీగణపతి హోమంలో 17 జంటలు, స్వామివారి పంచామృతాభిషేకాల్లో నలుగురు దంపతులు పూజలు చేశారు. స్వామివారి గరిక పూజలో ఒక జంట పాల్గొంది. ఐదు జంటలు స్వామికి ఉండ్రాళ్ల పూజ చేశారు. స్వామి వారి సన్నిధిలో 13 మంది చిన్నారులకు అక్షరభ్యాసం, నలుగురికి తులాభారం, ఒకరికి నామకరణ, ఏడుగురు చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. 37 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2400 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,98,976 ఆదాయం లభించినట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

మనపై మనకు నమ్మకముంటే సివిల్స్ కష్టం కాదు

316వ ర్యాంకర్ కీర్తిరెడ్డి



కీర్తిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న బంధువులు

నల్లజర్ల: సివిల్స్‌లో 316వ ర్యాంకు సాధించిన శ్రీనివాస కీర్తిరెడ్డి, ఆమె భర్త శ్రీసాయి (ఐఏఎస్ అధికారి, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ అధికారి, విజయవాడ) ఆదివారం పోతవరంలోని బంధువుల ఇంటికి వచ్చారు. వారిని సమీప బంధువు గన్నమనేని దొరయ్య, ఆయన సోదరులు వెంకటేశ్వర రావు, ప్రభాకరరావు, మాజీ సర్పంచ్ పసుమర్తి రాధ సత్కరించారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ, ఆగస్టులో తాను శిక్షణకు వెళ్తున్నానని చెప్పారు. బిట్స్ పిలానీలో ఇంజినీరింగ్ చదివానని, మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగం వచ్చినా కాదనుకున్నానని అన్నారు. పెళ్లయినా సరే ఎలాగైనా సివిల్స్ సాధించాలని కంకణం కట్టుకొని ఐదుసార్లు విఫలమయ్యానని, ఆరోసారి రెట్టింపు ఉత్సాహంతో 316వ ర్యాంకు సాధించానని తెలిపారు. రోజుకు దాదాపు 8 గంటలు చదివానని, మొదటి మూడుసార్లు పాసవుతానన్న గ్యారంటీ లేదని అన్నారు. సివిల్స్‌కు ఎంపిక కాలేనేమోనని భయం వేసిందని, అయితే, మనపై మనకు నమ్మకముంటే సివిల్స్ సాధించడం కష్టం కాదని మూడో ప్రయత్నం తర్వాత తెలుసుకున్నానని వివరించారు. ఐదో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకూ వెళ్లానని, కష్టపడటం, నమ్మకం, ఆశతో ముందుకెళ్లి ఆరోసారి విజయం సాధించానని తెలిపారు. తన విజయం వెనుక తల్లిదండ్రులు, భర్త, అత్తమామల ప్రోత్సాహం ఎంతో ఉందని కీర్తిరెడ్డి చెప్పారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక పరీక్ష

- విద్యాశాఖ ఉత్తర్వులపై అసంతృప్తి
- ఇది సరికాదంటున్న సంఘాల నేతలు



రాయవరం: వేసవి సెలవుల్లోనూ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం ఎంతవరకూ సమంజసమని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. వేసవి సెలవుల దృష్ట్యా సాధారణంగా మార్చి 15 నుంచి పాఠశాలలను ఒంటి పూట నిర్వహిస్తారు. కాగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులకు మే నెలలో రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలంటూ ఉత్తర్వులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవులు తీసుకుంటున్న టీచర్లను వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణిస్తారు. పది పరీక్షలకు పూర్తి స్థాయిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణిస్తూ ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

3వ తేదీన ఉత్తర్వులు

పది ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలంటూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నెల 2న ఉత్తర్వులు విడుదల చేశారు. ఆ రోజు నుంచే తరగతులు ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఉత్తర్వులు 3వ తేదీన ఉపాధ్యాయ, వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడంతో ఉపాధ్యాయులు మండు వేసవిలో ఇదెక్కడి న్యాయమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని ఈఎల్ ప్రస్తావన

విద్యాశాఖ ఉత్తర్వుల్లో ఎక్కడా ఆర్జిత సెలవుల ప్రస్తావన లేకపోవడం, ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించాలని, ఆదివారం, సెలవు దినాల్లో కూడా పనిచేయాలని పేర్కొనడం ఉపాధ్యాయ వర్గాల్లో అసంతృప్తి రగిలించింది. పరీక్షలకు ముందు వంద రోజుల ప్రణాళిక, దసరా, సంక్రాంతి సెలవుల్లో పనిచేసిన వారికి సీసీఎల్ మంజూరు చేస్తామని నేటికీ ఇవ్వకపోవడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయ సంఘాలు సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను కలవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

ఆకస్మికంగా విడుదల



ప్రత్యేక తరగతుల షెడ్యూల్‌ను అకస్మాత్తుగా విడుదల చేశారు. మిడ్‌సమ్మర్‌లో రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదు.

– పి.సురేంద్రకుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి



అంగీకారం తెలిపిన ఉపాధ్యాయులతో మాత్రమే ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. వారికి కచ్చితంగా ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి. ఇప్పటికే పలువురు ఉపాధ్యాయులు వేసవి సెలవులకు దూరప్రాంతాలకు వెళ్లారు. వారిని బలవంతంగా రప్పించడం సరికాదు.

– పోతంశెట్టి దొరబాబు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

పునరాలోచించాలి



ప్రత్యేక తరగతుల ఉత్తర్వులపై విద్యాశాఖ డైరెక్టర్ పునరాలోచించాలి. ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నా విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంటుంది.

– దీపాటి సురేష్‌బాబు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

సీసీఎల్స్ మంజూరు చేయాలి



పది పరీక్షలకు ముందు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేశాం. గతంలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సెలవు దినాల్లో పనిచేసిన వారికి సీసీఎల్స్ మంజూరు చేయాలి. ఈఎల్స్ ఇవ్వకుంటే బహిష్కరణకు పిలుపునిస్తాం.

– పెన్చెట్టి నరేష్‌బాబు, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

అయోధ్య రాముని ధనుస్సుకు పూజలు



రామయ్య ధనుస్సుకు పూజలు చేస్తున్న అర్చకులు

ఐ.పోలవరం: అయోధ్య రామయ్య కోసం తయారు చేసిన ధనుస్సుకు మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 13 కిలోల వెండి, కిలో బంగారంతో ఈ ధనుస్సును ప్రత్యేకంగా రూపొందించారు. తొలుత ఆలయానికి చేరుకున్న ధనుస్సుకు ఆలయ సహాయ కమిషనర్, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులు, భక్తులు, మేళతాళాలతో మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. 14 ఏళ్ల వనవాసానికి ప్రతీకగా 14 కిలోల బరువుతో రూపొందించిన ఈ ధనుస్సు దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాలలో భక్తుల దర్శనార్థం యాత్రను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా భద్రకాళీ సమేత వీరేశ్వరుని ఆలయానికి వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామి వారి మూలవిరాట్ వద్ద ధనుస్సుకు ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ, బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ప్రత్యేక పూజలు చేశారు.

భార్యపై కత్తితో దాడి

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోకవరం గ్రామానికి చెందిన దూలం శ్రీను, సోమేశ్వరం గ్రామానికి చెందిన సత్యకుమారిని 18 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమేశ్వరంలో ఉంటూ శ్రీను కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూడు నెలల నుంచి భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదివారం ఉదయం సత్యకుమారి ఇంట్లో ఉన్న సమయంలో భర్త శ్రీను కత్తితో దాడి చేశాడు. ఆ సమయంలో ఆమె చేతులు అడ్డు పెట్టడంతో చేతికి గాయమైంది. చికిత్స నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చేర్పగా అక్కడ ఆమె చేతికి ఏడు కుట్లు పడ్డాయి. కొంతకాలంగా భార్య సత్యకుమారిని అనుమానంతో భర్త శ్రీను వేధిస్తున్నాడన్నారు. దాడి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

కూర్మానికి కష్టకాలం!



- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- నియంత్రణ లేని చేపల వేట
- సముద్ర జలాల్లోనే వలల వ్యర్థాలు
- చమురు కాలుష్యం మరోవైపు
- ఏటా వందల సంఖ్యలో మృతి చెందుతున్న తాబేళ్లు

కాట్రేనికోన: సుమారు 350 ఏళ్లకు పైబడి **ఆయుః ప్రమాణం** ఉండే ఆలివ్ రిడ్లే **తాబేళ్లు** అల్పాయుష్షుతో చనిపోతున్నాయి. హిందూ **మహా** సముద్రం నుంచి సంతానోత్పత్తి కోసం ఏటా **బం**గాళాఖాతానికి వలస వస్తాయి. ఇక్కడ గుడ్లు **పెట్టేం**త వరకూ తీరం వెంబడి జీవిస్తాయి. ఆడ **తాబేళు** గుడ్లు పెట్టేందుకు సముద్రపు ఒడ్డుకు వస్తే తిరిగి వచ్చే వరకూ మగ తాబేలు సముద్ర తీరంలోని కెరటాల్లో ఎదురు చూస్తుంటాయి. గుడ్లు వదిలిన అనంతరం తిరిగి అవన్నీ హిందూ మహా సముద్ర జలాలకు తరలిపోతాయి. ఇదీ వాటి జీవన విధానం. కాగా సంతానోత్పత్తికి వచ్చే వేలాది తాబేళ్లు ఇటీవల చమురు వ్యర్థాలతో కలుషితమవుతున్న సముద్ర జలాలతోనూ, ప్లాస్టిక్ వ్యర్థాలతో, వలల అవసేషాలతో చిక్కుకోవడం తదితర కారణాలతో ఇక్కడి పరిస్థితులకు ఇమడలేక వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. వాటిని కాకులు, కుక్కలు, నక్కలు, పీతలు, ఇతర జీవులు తింటున్నాయి. కాగా చనిపోయిన తాబేళ్లను పరిశీలిస్తే చమురు వాసన వస్తోందని స్థానికులు అంటున్నారు.

వచ్చి వెళ్లే క్రమం ఇదీ..

డిసెంబర్ నుంచి మార్చి వరకు ఆలివ్ రిడ్లే తాబేళ్లు వచ్చి గుడ్లు పెడతాయి. అవి పిల్లలయ్యాక మే నెలలో తిరిగి వెళ్లిపోతాయి. ఒక్కొక్క తాబేలు సుమారు 80 నుండి 150 వరకు గుడ్లు పెడతాయి. అవి పొదగడానికి అనుకూలమైన ఉష్ణోగ్రత ఉన్నంత లోతులో గొయ్యి తవ్వి పూడ్చేస్తాయి. వాటిని నక్కలు, కాకులు, పక్షుల బారిన పడకుండా అటవీ శాఖ అధికారులు పునరుత్పత్తి కేంద్రంలో భద్రపరచి 42 నుంచి 45 రోజుల మధ్య పుట్టిన పిల్లలను బయటకు తీస్తారు. మే నెలలో పిల్లల తో పాటు తాబేళ్లు పురిటి గడ్డకు తరలిపోతాయి. ఇవి భారతదేశంలో అత్యధికంగా ఒడిశా తీరానికి, తరువాత ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడలోని హోప్ ఐల్యాండ్‌కు ఎక్కువగా వస్తుంటాయి. ఈ ఏడాది 79,800గుడ్లు పెట్టాయని పునరుత్పత్తి కేంద్రాలలో భద్ర పరిచామని, ఇప్పటికి సుమారు 40 వేల పిల్లలను సముద్ర జలాల్లో విడిచిపెట్టామని, మిగిలినవి కూడా పిల్లలయ్యాక వదులుతామని అటవీశాఖ అధికారులు చెప్పున్నారు.



చిర్రయానం సముద్ర తీరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాబేళ్ళ పునరుత్పత్తి కేంద్రం

నియంత్రణ లేని చేపల వేట

మత్స్యకారులు అడ్డూ అదుపు లేకుండా చేస్తున్న చేపల వేట సముద్ర జీవులు, సముద్ర తాబేళ్ల పాలిట శాపంగా మారింది. మత్స్యకారులు చేపల వేటకు పనికిరాని, పాడైపోయిన ప్లాస్టిక్ వలలను సముద్ర జలాలలో వదిలివేస్తుండడంతో తాబేళ్లు వాటిలో చిక్కుకుని చనిపోతున్నాయి.

అధికారుల అలసత్వం

ఏటా ఏప్రిల్ మూడో తేదీన ప్రపంచ జలచరాల దినోత్సవం సందర్భంగా అంతరించిపోతున్న జాతులు తిండి సార, సముద్ర గుర్రం, వేల్ సార్క్, ఆలివ్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. చేపలు వేటాడుతున్న మత్స్యకారులు, విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్ర జీవులకు పొంచిఉన్న ముప్పుపై సంబంధిత అధికారులు చైతన్య పరచాల్సి ఉంది. కాలుష్య నియంత్రణ, అటవీ, మత్స్యశాఖల అధికారులు ఇందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. సంతానోత్పత్తి సమయంలో వచ్చే ఆడ, మగ తాబేళ్ల రక్షణకు ఆ కాలంలో వేటను నిషేధించాలి. మత్స్య జాతుల సంతానోత్పత్తికి అండంకిగాను, సముద్ర జలాలను విషతుల్యం చేస్తున్న పరిశ్రమలు, రొయ్యల హేచరీలు, చమురు సంస్థ వ్యర్థాలను సముద్ర జలాలలో వదలకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాల్సి ఉందని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

సముద్ర జలాల కాలుష్యం వల్లే

సముద్ర తీరం వెంబడి పుట్ట గొడుగుల్లా వెలిసిన రొయ్యల హేచరీలు, పలు సంస్థలు చేపట్టిన చమురు అన్వేషణల వల్ల విడుదలవుతున్న వ్యర్థాలతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతోందని నిపుణులు చెప్తున్నారు. అంతరించుకు పోతున్న జాబితాలో ఉన్న అనేక జల చరాల పునరుత్పత్తి జరగడం లేదు. వాటిలో సముద్ర తాబేళ్లు కూడా ఉండడం బాధాకరం. నదీపాయలు, సముద్ర జలాలలో చమురు సంస్థలు చేపట్టిన డ్రెడ్జింగ్ పనులతో గోదావరి సహజత్వాన్ని కోల్పోయి చేపలు, రొయ్యలు గోదావరి పాయలలోకి రావడం లేదని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. వరద నీటికి ఎదురు వచ్చే అత్యంత రుచికరమైన పులసలు అంతరించిపోయాయని, చేపలు పడక జీవనోపాధిని కోల్పోయామని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.



మృత్యువాత పడి సముద్ర ఒడ్డుకు కొట్టుకొని వచ్చిన తాబేలు

వలల్లో చిక్కుకోవడం వల్లే

చేపలను వేటాడుతున్న సమయంలో ఆ వలల్లో తాబేళ్లు చిక్కుకుని చనిపోతున్నాయి. మత్స్యకారులకు ఈ విషయమై అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– ఎంవీ ప్రసాదరావు, డీఎఫ్ఓ

ప్రజలను చైతన్యపరచాలి



అంతరించిపోతున్న సముద్ర జాతుల రక్షణకు విద్యార్థులు, స్థానిక మత్స్యకారులకు అవగాహన కల్పించాలి. పాత వలలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్ర జలాలలో వేయకుండా చైతన్యపరచాలి. తాబేళ్లు మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా తీసుకోవడం, జలాలు కలుషితం కావడం, వలలలో చిక్కుకోవడంతో చనిపోతున్నాయి.

– పి.రామ్మోహనరావు, విశ్రాంత ఏడీ, మత్స్యశాఖ

మాజీ మంత్రి జవహర్ ఇంట్లో రూ.2.4 లక్షల సొత్తు చోరీ

కొవ్వూరు: మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఇంట్లో రూ.2.4 లక్షల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు ఆయన కుమారుడు ఆశిష్ అమృత్‌లాల్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. నాలుగు కాసుల నాలుగు బంగారు ఉంగరాలు, రెండు కేజీల వెండి కంచాలు, రూ.45 వేలు నగదు, వాచ్ ఒకటి, పనిచేయని రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఇంట్లో మూడు యాపిల్ ఫోన్‌లు, శామ్‌సంగ్ ట్యాబ్ మాత్రం మంచం పైనే పడవేసి పనిచేయని రెండు సెల్‌ఫోన్ తీసుకెళ్లడం గమనార్హం. ఈ చోరీ వ్యవహారంపై సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తు న్నారు. ఈ చోరీ ఎవరైనా స్థానికులే చేశారా, లేదంటే బయటి వ్యక్తుల పనా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

కిర్లంపూడి: కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన వ్యక్తి గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు బూరుగుపూడికి చెందిన కొండలమహంతి శ్రీనివాస్ మద్యానికి బానిసై, నిత్యం గొడవపెడతుండడంతో విసిగిపోయిన అతని భార్య హారికి తన ఇద్దరు పిల్లలను తీసుకుని రాజమహేంద్రవరం వెళ్లిపోయింది. అనారోగ్య సమస్యలు, అప్పుల బాధలు, భార్య తనని వదిలేసి పుట్టింటికి వెళ్లిపోవడంతో తల్లి మందలించింది. దీంతో ఈ నెల 3వ తేదీన మనస్తాపంతో శ్రీనివాస్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనికి జగ్గంపేట సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యానికి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అతడు చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. అతని భార్య హారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అలరించిన వాడపల్లి చరితం



వాడపల్లి క్షేత్ర చరిత్ర నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న బాలలు

నృత్య రూపకాన్ని ప్రదర్శించిన చిన్నారులు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో ఆదివారం రాత్రి బాలికల నృత్య రూపకం అలరించింది. ఆలయ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వాడపల్లి, లొల్ల గ్రామాలకు చెందిన సత్యసాయి బాల వికాస్ బాలలచే వాడపల్లి దివ్య క్షేత్ర చరిత్ర నత్య రూపకాన్ని ప్రదర్శించారు. వారిని దేవదాయ–ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, పలువురు ప్రముఖులు, గ్రామ పెద్దలు అభినందించి సత్కరించారు. కాతేరు గ్రామస్తులు వెంకటేష్ ప్రణవి చౌదరి కుటుంబ సభ్యులు వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ 50,116 విరాళంగా అందచేశారు. వారికి దేవస్థానం సూపరింటెండెంట్ పి.రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని అందచేశారు.

మత్తు చల్లి నిండా ముంచేశారు

- పెరవలిలో ఓ ఇంటిలో చోరీ
- దంపతులపై మందు ప్రయోగం
- బీరువాలోని అరలను ఇంటి ఆవరణలో వదిలేసిన వైనం
- 19 కాసుల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు అపహరణ

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో శనివారం రాత్రి తెల్లవారితే ఆదివారం 19 కాసులు బంగారం, రూ.40 వేల నగదును దొంగలు అపహరించారు. పెరవలి ఎసై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నవరప్పాడుకు చెందిన గటికొప్పు శ్రీనివాస్ ఇంటిలో అర్ధరాత్రి జరిగిన ఈ చోరీలో యజమాని అతని భార్య రాజేశ్వరిలకు ఎటువంటి హానీ తల పెట్టకుండా కేవలం నగదు, బంగారం మాత్రమే పట్టుకుని ఉడాయించారు. శ్రీనివాస్ దంపతులు శనివారం రాత్రి ఇంటి గేట్లకు తాళాలు వేసి నిద్రపోయారు. తెల్లవారుజాము 4 గంటలకే నిద్రలేచే అలవాటున్న వారు పొద్దెక్కినా లేవకపోవడంతో వారిపై మత్తు పదార్థమేదైనా ప్రయోగించారా అని అనుమానిస్తున్నారు. రాజేశ్వరి 5.30కు లేచిన తరువాత బయటకు వచ్చి ఇంటిని శుభ్రపరిచేందుకు ఉపక్రమిస్తుండగా ఆ ఆవరణలో బీరువా అరలు కనపడేసరికి తన భర్తను లేపి విషయం చెప్పింది. దీంతో వారు చోరీ జరిగినట్టు గుర్తించారు. వారి రోదనలకు చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన ప్రదేశానికి వచ్చి పరిశీలించి దొంగలు ఇంటి వెనుకనుంచి వచ్చినట్టు గుర్తించారు. అలాగే వారు ఆ భార్యాభర్తలపై మత్తుమందు ప్రయోగించడం వల్లే స్పృహ కోల్పోయారని పోలీసులు తెలిపారు. అలాగే దొంగలు బెడ్ రూమ్‌లోకి ప్రవేశించి బీరువాలోని అరలను ఇంటి ఆవరణలోకి తీసుకువచ్చి కేవలం బంగారం, నగదు మాత్రమే దోచుకుపోయారని తెలిపారు. అరల్లోని వెండి వస్తువులు తీసుకువెళ్లలేదని పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసులు, క్రైమ్ బ్రాంచి, ఎస్‌బీ సిబ్బంది వచ్చి దొంగతనం జరిగిన తీరును, గ్రామంలోని సీసీ టీవీలను పరిశీలించారు. అనంతరం దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ చోరీలో రెండు హారాలు, రెండు గాజులు, అరవంకీ, చిన్న వస్తువులు మొత్తంగా 19 కాసుల బంగారు ఆభరణాలు చోరీ అయినట్టు బాధితులు తెలిపారు. ఇంటి యజమాని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు



ఇంటి ఆవరణలో చెల్లాచెదురుగా పడి ఉన్న బీరువా అరలు, లాకర్లు

ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు



సుంకటరేవు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకటరేవు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌తో పాటు ఐదుగురు మహిళలకు గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యానాం నుంచి కాకినాడకు ప్రయాణికులతో వెళుతున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో మట్లపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కర్రి శ్రీనివాస్‌తో పాటు నడింపల్లి సూర్యకుమారి, దడాల వెంకటరమణ, రేకాడి వేణి, గేదెల ధనలక్ష్మి, పాలెపు నాగమణిలకు గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

బీచ్ కబడ్డీ విజేతలు వీరే

- పురుషుల విభాగంలో నెల్లూరు..
- మహిళల్లో కృష్ణా జట్లు విజయం



మహిళావిభాగంలో విజేత కృష్ణా జిల్లా జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న మంత్రి మనోహర్



పురుషుల విభాగంలో విజేత నెల్లూరు జట్టుకు బహుమతి ప్రదానం

కాకినాడ రూరల్: ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ సాగర తీరాన మూడు రోజుల పాటు నిర్వహించిన 12వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి సీనియర్ బీచ్ కబడ్డీ పోటీల విజేతలుగా పురుషుల విభాగంలో నెల్లూరు, మహిళల విభాగంలో కృష్ణా జట్లు నిలిచాయి. స్థానిక సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో ఆదివారం ఫ్లడ్ లైట్ల వెలుతురులో నాలుగు సెమీ ఫైనల్స్, రెండు ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహించారు. పురుషుల విభాగంలో మొదటి సెమీ ఫైనల్‌లో గుంటూరుపై ప్రకాశం, రెండో సెమీ ఫైనల్‌లో తూర్పుగోదావరిపై నెల్లూరు జట్లు విజయం సాధించాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోరులో ప్రకాశంపై నెల్లూరు జట్టు విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. మహిళల విభాగంలో మొదటి సెమీ ఫైనల్‌లో వైజాగ్‌పై కృష్ణా, రెండో సెమీ ఫైనల్‌లో అనంతపురంపై చిత్తూరు జట్టు విజయం సాధించాయి. ఫైనల్ పోరులో చిత్తూరుపై కృష్ణా జట్టు విజేతగా నిలిచింది. పోటీలు అనంతరం విజేతలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబు, జ్యోతుల నెహ్రూ తదితరులతో పాటు ఎస్పీ బింధుమాధవ్, ఏపీ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి మెడల్స్ వేసి ట్రోఫీలు అందజేశారు.

నిర్మాణాలన్నీ పక్కప్లాన్లే!

- సింహాచలం దుర్ఘటన ప్రభావం రత్నగిరిపై
- రెండు దేవస్థానాలకు ఒకే కాంట్రాక్టర్ కావడంతో మొదటికొచ్చిన సమస్య
- ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెడితే ప్రసాద్ నిధులతో నిర్మాణాలకు బ్రేక్
- మాస్టర్ ప్లాన్ మీరొద్దని నిర్ణయిస్తే మళ్లీ టెండర్లు పిలిచే అవకాశం


అన్నవరం: ఇటీవలి సింహాచలం చందనోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న దుర్ఘటన ప్రభావం రత్నగిరిపై పడనుంది. 'ప్రసాద్' పథకం కింద చేపట్టిన నిర్మాణాలు మరింత ఆలస్యం కానున్నాయి. ఇందుకు కారణం అన్నవరం, సింహాచలం దేవస్థానాల్లో ఈ పథకం ద్వారా చేపట్టే నిర్మాణాల టెండర్లను దక్కించుకున్నది శ్రీకాకుళానికి చెందిన అనంతరాములు అండ్ కో కావడమే. సింహాచలంలో గోడ కూలిన ఘటనపై ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని భావిస్తుండడమే ఇందుకు కారణం. మాస్టర్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు ఉండాలని ప్రభుత్వం ఆదేశించే అవకాశం ఉండడంతో ప్రస్తుతం చేపట్టిన నిర్మాణాలు అందుకు విరుద్ధంగానే ఉండడం వల్ల టెండర్లు రద్దవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే జరిగితే ప్రసాద్ పథకం కింద చేపట్టే నిర్మాణాలకు మరోసారి టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అనంత్‌రాములు అండ్ కో సింహాచలంలో ఇప్పటికే రూ.54 కోట్ల ప్రసాద్ నిధులతో వివిధ నిర్మాణాలు చేపట్టారు. అవి దాదాపు సగం వరకు పూర్తయ్యాయి. రత్నగిరిపై రూ.20 కోట్లతో పలు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

వీటిలో రూ.18.98 కోట్లు వ్యయమయ్యే నిర్మాణాలకు మాత్రమే టెండర్లు పిలిచారు. ఇవి 16 శాతం లెస్‌కు ఖారరవడంతో రూ.మూడు కోట్లు ఆదా అయ్యాయి. ఈ మొత్తాన్ని దేవస్థానంలో వివిధ నిర్మాణాలకు ఖర్చు చేయనున్నారు.

సింహాచలంపై దుర్ఘటన నేపథ్యంలో మాస్టర్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు ఉండాలని ప్రభుత్వ నిర్ణయిస్తే రత్నగిరిపై అన్నదాన భవనం ప్రకాష్ సదన్ వెనుక నిర్మించాలి. టీటీడీ సత్రం స్థలంలో క్యూ కాంప్లెక్స్ (వ్రతమండపాల భవనం) నిర్మించాలి. ప్రస్తుతం ప్రసాద్ టెండర్లలో అందుకు భిన్నంగా టీటీడీ సత్రం స్థలంలో అన్నదాన భవనం, ప్రస్తుత అన్నదాన భవనం స్థలంలో క్యూ కాంప్లెక్స్ నిర్మించారు. వాటిని ప్లాన్ ప్రకారం మార్చాల్సి ఉంటుంది. ఆ మేరకు వీటికి మళ్లీ టెండర్లు పిలవాల్సి ఉంటుంది.

ప్రసాద్ నిధులతో చేపట్టనున్న నిర్మాణాలు

- పాత టీటీడీ భవనం స్థలంలో రూ.11.09 కోట్లతో రెండు అంతస్తుల అన్నదాన భవనం.
- ప్రస్తుత అన్నదాన భవనం పక్కన రూ.9 కోట్లతో క్యూ కాంప్లెక్స్.
- ప్రకాష్ సదన్ వెనుక పార్కింగ్ స్థలంలో సత్యగిరి, రత్నగిరికి దగ్గరగా రూ.61.78 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం.
- రూ.కోటి వ్యయంతో రెండు బ్యాటరీ కార్ల మంజూరు.
- రూ.1.08 కోట్లతో వ్యర్థజలాల శుద్ధి ప్లాంట్ నిర్మాణం
- రూ.91.96 లక్షలతో క్యూ కాంప్లెక్స్ ప్రహరీ గోడ నిర్మాణం



ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు

సింహాచలం దేవస్థానంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనలో అక్కడ ప్రసాద్ స్కీం నిర్మాణ కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం తీసుకునే చర్యల మీదే తదుపరి చర్యలు ఉంటాయి. ఒక వేళ అక్కడ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడితే ఇక్కడ కూడా అతనే కాంట్రాక్టర్ కనుక ఆ మేరకు చర్యలు తీసుకుంటాం.


– ఈశ్వరయ్య, చీఫ్ ఇంజినీర్, టూరిజం శాఖ

అదనపు కట్నం కోసం వేధింపు

- మహిళను ఇంటి నుంచి గెంటేసిన భర్త, అత్తమామలు

రామచంద్రపురం రూరల్: అత్తమామలు, భర్త తనను రూ.2 లక్షల అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తూ ఇంటి నుంచి బయటకు గెంటేశారని మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి రామకృష్ణ తన మూడో కుమార్తె సత్యవేణిని కపిలేశ్వరపురం మండలం పడమరఖండ్రికకు చెందిన గుత్తుల శ్రీను, మంగ దంపతుల రెండో కుమారుడు గుత్తుల నాగేశ్వరరావుతో 2020 నవంబరు 25న వివాహం చేశారు. ఆ సమయంలో రూ.5 లక్షల కట్నం, 20 కాసుల బంగారు వస్తువులు, ఇతర గృహోపకరణాలు కట్నంగా ఇచ్చారు. వివాహం అయిన కొద్దిరోజుల నుంచే తాను వ్యాపారం చేస్తానని మరో రూ.2 లక్షలు తీసుకుని రావాలని శారీరకంగా, మానసికంగా హింసించేవారు. అంతే కాకుండా పిల్లలు పుట్టని కారణంగా నువ్వు గొడ్డుమోతుదానివి, నీ ముఖం చూడకూడదంటూ అత్తమామలు తరచుగా వేధించేవారని ఫిర్యాదులో పేర్కొంది. అంతే కాకుండా తన భర్త వేరే మహిళలతో వివాహేతర సంబంధం కొనసాగించినా అతడికే మద్దతుగా మాట్లాడుతూ హింసించేవారని, తన తండ్రికి అంత స్తోమత లేదని చెప్పినా వినకుండా తనను బలవంతంగా ఇంటి నుంచి గెంటేయడంతో తన పుట్టింటికి చేరుకుంది. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260